క్లుప్తంగా

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



సీతారాములను దర్శించుకుంటున్న భక్తులు

పాయకరావుపేట : మండలంలోని రామభద్ర పురం పంచాయతీ శివారు సిహెచ్. నర్సాపురం గ్రామంలో నూతనంగా తిరుమల తిరుపతి దేవ స్థానం (శ్రీవాణి ట్రస్ట్) వారి ఆర్థిక సహకారంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీతా రామాలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సంస్థ సభ్యులు పోతు రంగారావు, పిల్లి శ్రీరాములు, జిల్లా ధర్మప్రచారక్ నక్కా సత్యనారాయణ, సబ్ డివిజన్ కన్వీనర్ నీలాపు వెంకటరెడ్డి, మండల కన్వీనర్ తాడి సూర్యమూర్తి, మహిళా కన్వీనర్ చిట్టెమ్మ, చాపల అప్పలరాజు, సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ కట్టా వీర బాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి స్పందన దోహదం

మునగపాక : ప్రజా సమస్యల పరిష్కారానికి స్పందన దోహదపడుతుందని తహసీల్దార్ ప్రకాశరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ హాలులో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. సమస్యలను సాధ్యమైనంతవరకు అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. డీటీ వినయ్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భావ కల్యాణ పోతురాజు ఆలయ శంకుస్థాపన



పోతురాజు స్వామి ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న గ్రామ ప్రజలు

యలమంచిలి : మండలంలో లైనుకొత్తూరు మర్రిబంధ గ్రామంలో భావ కల్యాణ పోతురాజు స్వామి వారి ఆలయ పునర్నిర్మాణం కోసం సోమవారం గ్రామ పెద్దలు ఘనంగా భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. గ్రామ ప్రజల సహకారంతో త్వరలోనే సర్వాంగ సుందరంగా ఆలయ నిర్మాణం జరుగుతుందని గ్రామ ప్రజలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



డిపాజిట్ పత్రాలు వరలక్ష్మికి అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

నక్కపల్లి : మండలంలో సీతంపాలెం గ్రామానికి చెందని కోటబోయిన శ్రీను రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అతని మరణంతో కుటుంబం అనాథగా మారింది. దీంతో గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ వారు రూ.1.61 లక్షలు సేకరించి బాధిత కుటుంబ సభ్యుల పేరున బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఈ మేరకు పత్రాలను సోమవారం మృతుడి భార్య వరలక్ష్మికి అందజేశారు.

దూడకు శస్త్ర చికిత్స



దూడకు హెర్నియోరాపీ చికిత్స చేస్తున్న మండల పశువైద్యాధికారి ప్రదీప్

మునగపాక: మండలంలోని తోటాడ గ్రామానికి చెందిన పాడి రైతు నారాయణకు చెందిన దూడపెయ్యి కొద్ది రోజులుగా హెర్నియాతో ఇబ్బంది పడుతూ ఉంది. ఆయన పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్‌ను సంప్రదించగా ఆయన దూడ పెయ్యికి హెర్నియోరాపీ శస్త్ర చికిత్స నిర్వహించారు. దీంతో దూడపెయ్యి ఆరోగ్య స్థితిలోకి రావడంతో రైతు హర్షం వ్యక్తం చేశారు.

విద్యా కానుక...బడిలో వేడుక

- ఉత్సాహంగా హాజరైన విద్యార్థులు
- పుస్తకాలు, విద్యా కానుక కిట్లు పంపిణీకి సిద్ధం



ప్రభుత్వ హైస్కూల్లో పంపిణీకి సిద్ధంగా వున్న పుస్తకాలు



విద్యార్థులకు రాగి జావను అందిస్తున్న జగనన్న పౌష్టికాహారం నిర్వాహకులు



మూలపేటలో విద్యార్థులకు విద్యాకానుక కిట్‌లు అందజేస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

పాయకరావుపేట : వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. మండలంలో గల 24 గ్రామాల పరిధిలోను 11 జిల్లా పరిషత్ పాఠశాలలు, 41 ఎలిమెంటరీ పాఠశాలలు, ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, 5 మండల పరిషత్ పాఠశాలలు వున్నాయి. వీటిలో 6900 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు సరఫరా చేయడం కోసం సిద్ధంగా ఉన్నాయి. స్కూల్ బ్యాగ్‌లు, పుస్తకాలు, బూట్లు, సాక్సులు, యూనిఫారమ్‌లు సిద్ధంగా ఉన్నాయి. అదే విధంగా పాఠశాలలు ప్రారంభంలో సోమవారం విద్యార్థి హాజరు తక్కువ వున్నప్పటికీ జగనన్న గోరుముద్ద లో భాగంగా ఉదయం 9 గంటలకే రాగిజావను విద్యార్థులకు అందించారు.

విద్యాకానుక కిట్ల పంపిణీ

మునగపాక : విద్యాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని మూలపేట సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మూలపేట పాఠశాలలో ఆయన సోమవారం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్‌లను అందజేశారు.హెచ్‌ఎం నరసింగరావు, వార్డు సభ్యులు హైమావతి, గోవిందరావు, వరలక్ష్మి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

15న విద్యా కిట్ల పంపిణీ

రాంబిల్లి : వేసవి సెలవులు అనంతరం సోమవారం పాఠశాలలు తెరుచుకున్నాయి. మండలంలో 58 ప్రభుత్వ పాఠశాలలు వుండగా 3732 విద్యార్థులు చదువుతున్నారు. తొలిరోజు 2752 మంది విద్యార్థులు తరగతులకు హాజరైనట్లు ఎంఈవో ఎం. సూర్యారావు తెలిపారు. జగనన్న విద్యాకానుక కిట్లు ఈ నెల 15న ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు చేతుల మీదుగా అందజేయడం జరుగుతుందన్నారు. సెలవుల అనంతరం విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు హాజరయ్యారు.

గడప గడపలోనూ సంక్షేమమే

ఎమ్మెల్యే బాబూరావు



సీతంపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : గడప గడపలోను సంక్షేమ పథకాలు వర్తింపజేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదేనని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. సీతంపాలెంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలను తెలుసుకున్నారు. పార్టీలతో ప్రమేయం లేకుండా అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలన్నదే జగనన్న లక్ష్యమన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయడం చంద్రబాబు నాయుడికి, తెలుగుదేశం పార్టీకి ఇష్టం లేదన్నారు. చంద్రబాబు హయాంలో కొత్తగా ఒక్క ఇల్లు గాని, ఇంటి స్థలం గాని మంజూరు చేయలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలు దయనీయ స్థితిలో ఉన్నా పట్టించుకోలేదన్నారు. జగనన్న వచ్చిన తర్వాత పాఠశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు. ఇపుడు ప్రభుత్వ పాఠశాలలకు ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదన్నారు. కార్మిక కర్షక లోకానికి సైతం మేలు చేకూర్చే పథకాలను అమలు చేశారన్నారు. ఈ పథకాలను కొనసాగించే సత్తా జగనన్నకే ఉందన్నారు. మళ్లీ 2024లో జగనన్నను సీఎంను చేసుకోవాలని భారీ మెజార్టీతో ఎమ్మెల్యేలను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు పాపారావు, సర్పంచ్ నాగఅప్పలరాజు, ఎంపీటీసీ గొర్ల గోవిందు, బీసీ సెల్ నాయకులు నర్సింహమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు తాతబాబు, గోవిందు, ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో బోరు నిర్మాణ పనులు



బోరు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : స్థానిక ఏరియా ఆస్పత్రిలో తాగునీరు, వాడుక నీరు సమస్య తీర్చేందుకు మండల పరిషత్ నిధుల నుంచి రూ.2 లక్షల వ్యయంతో బోరు మంజూరు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. సోమవారం ఆస్పత్రిలో బోరు నిర్మాణపు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రిలో 50 పడకల స్థాయికి అనుగుణంగా సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీయుఎఫ్ఐడీసీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సర్పంచ్ రత్నకుమారి, పార్టీనాయకులు శీరం నర్సింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజు, ఈవోఆర్‌డీ వెంకటనారాయణ, వైద్యాధికారి జనార్దన్ పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయం ప్రారంభోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఎస్.రాయవరం : పెట్టుగోళ్లపల్లి గ్రామంలో పునర్నిర్మాణం చేసిన నూకాంబిక అమ్మవారి ఆలయం సోమవారం ప్రారంభించారు. రెండు రోజులుగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు , హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రారంభోత్సవం పురస్కరించుకుని సోమవారం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి పసుపు కుంకుమలు, చీర సారెలు సమర్పించారు. ఉత్సవ కమిటీ సభ్యులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అల్లు మోహన్, నరసింహామూర్తి , ఉప సర్పంచ్ కొప్పిశెట్టి ఏడు కొండలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



దుర్గాదేవిని దర్శించుకుంటున్న దాడి వీరభద్రరావు

తుమ్మపాల: పట్టణంలోని 83వ వార్డు లక్ష్మీదేవిపేట శ్రీదుర్గాదేవి అమ్మవారి ఆలయ ఏకాదశ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఉత్సవాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను దుశ్శాలువాతో సత్కరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. మధ్యాహ్నం ఐదు వేల మందికి అన్నసమారాధన జరిపారు. ఉత్సవ కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపకుడు గొర్లి రాము, కార్యదర్శి వేపూరి రమేష్, డీపీఎం కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి



మాట్లాడుతున్న మండల పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్

మునగపాక : పశువుల ఆరోగ్యం విషయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్ కోరారు. తోటాడ సచివాలయంలో సోమవారం పశువుల పెంపకం–వాటి ఆరోగ్యంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

మేలు జాతి పశువులను కొనుగోలు చేయాలని, దాణా విషయంలో జాగ్రత్తలు పాటించాలని, పశువులకు ఎటువంటి అనారోగ్యం సంభవించిన అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేత కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వడగాడ్పులు



నిర్మానుష్యంగా రాంబిల్లి ప్రధాన జంక్షన్

రాంబిల్లి: మండలంలో సోమవారం వడగాడ్పులు కొనసాగాయి. ఐదు రోజులుగా వడగాడ్పుల ప్రభావం కొనసాగడంతో మండల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 9 గంటల వరకు కాస్త వాతావరణం చల్లగా కనిపించింది. అయితే ఆ తర్వాత మాత్రం మళ్లీ వేడిగాలులు కొనసాగాయి. వడగాడ్పులకు పలు రోడ్లు, జంక్షన్లు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఉపాధి కూలీలు, రైతులు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కోనబుజ్జి, విమలనాయుడు తదితరులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో గత నెల 8వ తేదీ నుంచి నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలు సోమవారంతో ముగిశాయి. వేసవి శిబిరంలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ఎంపీపీ కోన బుజ్జి, సర్పంచ్ విమలనాయుడు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పాఠకులకు, విద్యార్థులకు వక్తలు సూచించారు.గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రీ-సర్వే వేగవంతం చేయాలి

మునగపాక : రీ-సర్వే వేగవంతం చేయాలని తహసీల్దార్ ప్రకాశరావు కోరారు. స్థానిక మండల పరిషత్ హాలులో సోమవారం వీఆర్వోలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ-సర్వే ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా భూ వివాదాలకు అవకాశం ఉండదన్నారు. అనంతరం గ్రామాల వారీగా సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీటీ వినయ్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పొలాల్లో కోతుల బెడద

మునగపాక : కోతుల బెడద నుంచి కాపాడాలని కోరుతూ మండలంలోని గవర్ల అనకాపల్లికి చెందిన పలువురు రెవెన్యూ అధికారులకు సోమవారం వినతి అందజేశారు. కొంతకాలంగా గ్రామంలో కోతులు పెరిగిపోవడంతో గ్రామస్తులతో పాటు పంట పొలాలకు నష్టం జరుగుతుందని సీపీఎం నేత ఆళ్ల మహేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. విలువైన పంట పొలాలను కోతులు ధ్వంసం చేస్తున్నాయని, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మహేశ్వరరావు కోరారు.

అభివృద్ధి పనులు చురుగ్గా చేపట్టాలి

పాయకరావుపేట : గ్రామాల్లో చేపట్టవలసిన అభివృద్ధి పనులను గ్రామ కార్యదర్శులు చురుగ్గా చేపట్టాలని ఎంపీడీవో ఎ.సాంబశివరావు అన్నారు. గ్రామ కార్యదర్శులతో సోమవారం ఎంపీడీవో సమావేశం ఏర్పాటు చేసారు. గ్రామాల్లో చెత్త నుంయి సంపద కేంద్రాలను అభివృద్ధి చేయాలన్నారు. వైఎస్సార్ బీమా పథకం సత్వరం పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యలోపం లేకుండా, తాగునీటి ఎద్దడి రాకుండా నిత్యం జాగ్రత్తలు వహించాలన్నారు.

టీడీపీ హయాంలోనే అభివృద్ధి : అయ్యన్న

ఎస్.రాయవరం: రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసింది చంద్రబాబునాయుడేనని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి అడ్డురోడ్‌లో సోమవారం జరిగిన సమావేశంలో 2014 నుంచి 2019 అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో అవినీతి పేరుకుపోయిందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎంపీపీ యేజర్ల పెరుమళ్ల రాజు, నాలుగుమండలాల టీడీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

శాంతి కమిటీ సమావేశం

మునగపాక : అసాంఘిక కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఏఎస్ఐ మన్మథరావు కోరారు. మండలంలోని అరబుపాలెం సచివాలయంలో సోమవారం గ్రామ శాంతికమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, వివాదాలకు దూరంగా ఉండాలని అన్నారు. యువత పెడదారిన పడకుండా సన్మార్గంలో నడవాలన్నారు. మహిళా పోలీసు హేమలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి పాల్గొన్నారు.

16న ఉమా సాంబశివుని కల్యాణం

కశింకోట: స్థానిక కస్పావీధి ఉమా సాంబశివుని కల్యాణోత్సవాన్ని ఈ నెల 16న సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి వెయ్యిదళముల ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఉమా, సాంబశివుని ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపిస్తామన్నారు. ఆలయంలో ఆ రోజు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరపనున్నట్లు వెల్లడించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

గ్రామీణ ప్రాంతాలకు వరం..జల్ జీవన్ మిషన్



రుక్మిణీపురంలో రక్షిత తాగు నీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



పులపర్తిలో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- మండలంలో రూ.46 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం

యలమంచిలి : రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలకు శుద్ధ జలం జల్ జీవన్ మిషన్ ద్వారా సాధ్యం అవుతోందని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి రమణమూర్తి రాజు అన్నారు. ఆయన యలమంచిలి మండలంలో రుక్మిణీపురం గ్రామంలో రూ.6 లక్షలతో రక్షిత మంచి నీటి పథకం ద్వారా ఇంటింటికీ కుళాయిల నిర్మాణాన్ని ఎంపీపీ బోదెపు గోవింద్‌తో కలసి సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో జల్‌జీవన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించే సంకల్పంతో ముందుకు వెళుతుందని అన్నారు. యలమంచిలి మండలంలో అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చేయడమే ప్రథమ లక్ష్యమని, తాగునీటి వనరులను ప్రతి ఒక్కరూ సక్రమంగా వినియోగించుకోవాలని అన్నారు. రుక్మిణీపురం గ్రామంలో 280 కుళాయి కనెక్షన్లు సక్రమంగా పనిచేస్తున్నాయా అని వాటి సామర్థ్యంపై గ్రామీణ నీటి సరఫరా అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం పులపర్తి గ్రామంలో రూ.40 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సచివాలయంలో మౌలిక వసతులను పరిశీలించారు. గ్రామ సచివాలయంలో సచివాలయ అధికారులతో మాట్లాడారు. సచివాలయాన్ని సొంతింటి వలే పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సేనాపతి రాము, రుక్మిణీపురం సర్పంచ్ కరణం సత్తిబాబు, పులపర్తి సర్పంచ్ కొండబాబు, కోఆప్షన్ సభ్యులు శిద్దా నూకేశ్వరరావు, రేగుపాలెం సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, కృష్ణాపురం సర్పంచ్ వర్రే నూకినాయుడు, గాంధీ యలమంచిలి మండల గ్రామీణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, వైయస్సార్‌సీపీ నాయకులు సీతారాం, రవి, రూరల్ ఎస్ఐ కె.సన్నిబాబు, ఎంపీడీవో అప్పలనాయుడు, నీటి పారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారులు మండలంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి

రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న వరి విత్తనాలను రైతులంతా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. పులపర్తి రైతు భరోసా కేంద్రం వద్ద రాయితీపై ప్రభుత్వం ద్వారా అందించే వరి విత్తనాలను ఆయన రైతులకు అందజేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని విధాలుగా వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తోందని, రైతులు పంట దిగుబడి శాతాన్ని పెంచాలని రైతులకు ధాన్యం కనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరను అందిస్తోందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ డివిజనల్ అధికారి రవిప్రకాష్, మండల వ్యవసాయాధికారి మోహనరావు, వ్యవసాయ సహాయకులు దేవుడు పాల్గొన్నారు.

వైభవంగా రామాలయం ప్రారంభం



బోడపాలెంలో రామాలయం ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

కోటవురట్ల: దేవాలయాలు మానసిక ప్రశాంతతను ఇవ్వడంతో పాటు సన్మార్గంలో నడిపిస్తాయని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు సహకారంతో గ్రామ ప్రజలు, దాతల ఆర్థిక సహాయంతో సుమారు రూ.50 లక్షలతో బోడపాలెంలో నిర్మించిన రామాలయాన్ని సోమవారం వైభవంగా ప్రారంభించారు. వేద పండితుల వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా ఆలయాన్ని ప్రాంభించారు. శాంతి హోమం చేసి భారీ అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, జిల్లా పరిషత్ చైర్మన్ జల్లి సుభద్రమ్మ వేర్వేరుగా ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. వారు మాట్లాడుతూ పల్లెల్లో ఆలయాలను అద్భుతంగా నిర్మిస్తున్నారని, ఆధ్యాత్మిక భావన ప్రతి ఒక్కరినీ మంచి మార్గంలో నడిపిస్తుందన్నారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తప్పెటగుళ్లు, కోలాట, చిడతల డ్యాన్సు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయంలో మూడు రోజుల పాటు భజన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, సర్పంచ్ ఎస్.ఎరుకునాయుడు, ఎంపీపీ ఎస్.అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ కిల్లాడ సాయి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కిల్లాడ శ్రీనివాసరావు, డీవీ యువసేన గౌరవ అధ్యక్షుడు డీవీపీ రాజగోపాలరాజు, ఎస్.కిషోర్ పాల్గొన్నారు.

20న చలో విజయవాడ



చలో విజయవాడ కరపత్రాలను చూపుతున్న భవన నిర్మాణ కార్మికులు

యలమంచిలి : భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఈనెల 20న చలో విజయవాడ కార్యక్రమాన్ని భవన నిర్మాణ కార్మికులందరూ విజయవంతం చేయాలని అనకాపల్లి జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ పిలుపునిచ్చారు. సోమవారం యలమంచిలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్మాణ కార్మికులతో కలసి చలో విజయవాడ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీర్ఘకాలంగా నెలకొన్న భవన నిర్మాణ కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలన్నదే తమ ఆకాంక్ష అని అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో పెండింగ్‌లో ఉన్న క్లెయింలను వెంటనే పరిష్కరించాలని, సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు శివశంకర్, సభ్యులు బొడ్డేడ రాము, చలంశెట్టి శంకర్, మళ్ల జయరాం, యల్లపు గోవింద్, బొడ్డేడ కుమార్, సూరిశెట్టి గణేష్, గొలగాని నాయుడు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో రూ.1.40 లక్షల జరిమానా



మద్యం సేవించి వాహనం నడిపిన వారికి కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ సత్యనారాయణ

అనకాపల్లిటౌన్: పట్టణ పరిధిలో వివిధ ప్రాంతాల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 14 మంది వాహనదారులకు సోమవారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చినట్లు ట్రాఫిక్ సీఐ టి.శ్రీను, ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే మీతోపాటు, ఇతరుల ప్రాణాలకు కూడా హాని జరుగుతుందని హెచ్చరించారు. వీరిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఒక్కొక్క వ్యక్తికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. 14 మంది వాహనదారులు రూ.1.40 లక్షలు ప్రభుత్వానికి చెల్లించి, వారి వాహనాలను తీసుకున్నారని సీఐ వెల్లడించారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి



బాలకార్మిక దినోత్సవ ర్యాలీలో న్యాయమూర్తులు గంగరాజు, శివకిరణ్

అనకాపల్లిటౌన్: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని న్యాయమూర్తులు జి.గంగరాజు, శివకిరణ్‌లు పిలుపునిచ్చారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కోర్టు సముదాయం నుంచి రింగ్‌రోడ్డు వరకూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చదవించాలి తప్ప, పనిలో పెట్టరాదని కోరారు. కర్మాగారాల్లోను, హోటళ్లలోను పిల్లలతో పనిచేయించే వారిపై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థులు కోర్టు సిబ్బంది, చైల్డ్ వెల్ఫేర్ సిబ్బంది పాల్గొన్నారు.